ముద్దంశెట్టి హనుమంతరావు

బుద్ధి చెప్పింది!

రామరాజుగారింట్లో ఆ రోజు ఓ పండుగలా వుంది. అందరి మొహాల్లోనూ చెప్పలేనంత వుత్సాహం తొణికిసలాడుతోంది. అంత సందడికీ, ఆ వుత్సాహానికీ కారణం ఆ రోజు డాక్టర్ రవీంద్ర స్టేట్స్ నుంచి తిరిగివస్తూండటమే.

పై చదువులకోసం స్టేట్స్‌కి వెళ్ళిన డా. రవీంద్ర, ఫారెన్ డిగ్రీతో తిరిగి వస్తున్నందుకు, అతని తలితండ్రులు, కాబోయే అర్ధాంగి సుధ, ఆనందంతో వుక్కిరిబిక్కిరవుతూ, అతణ్ణి ఎప్పుడు చూస్తామా అన్న ఆతృతతో వున్నారు.

సుధ, నారాయణగారమ్మాయి, బి.ఏ. పాసయ్యింది. అందమూ, అందానికి దీటైన అణకువ, అకర్షణ, అమెని మరో మెట్టు పైనే నిలిపాయి.

సుధ ఆశలన్నీ రవీంద్ర పైనే ఉన్నాయి. బావ స్టేట్స్‌నుంచి తిరిగి వచ్చాక, తమ వివాహం వైభవోపేతంగా జరుగుతుందని, హాయిగా యెన్నెన్నో స్వప్నాలు చవిచూస్తూ సంసార జీవితాన్ని సాగిస్తామని స్నేహితురాంద్రతో చెప్పుకుంటూ ఉండేది.

రవీంద్ర తండ్రి, రామరాజు సంగతి సరేసరి. కొడుకు స్టేట్స్‌లో ఉంటూ కూడా తమకి యెటువంటి యిబ్బందీ కలుగ జెయ్యలేదు. ఇప్పుడెలాగూ స్వదేశం తిరిగి వచ్చేస్తున్నాడు గాబట్టి, తమ అంతస్తు, నిత్యజీవిత సరళి, యింకా పెరుగుతాయన్న ఆశ, అతనిలో బాగా నాటుకుంది. అదో తృప్తి.

ఇంత మంది యిన్ని విధాలుగా అనూహ్యమైన ఆనందాన్ని పొందుతున్నా ప్రతి ఒక్కరిలోనూ ఒకే ఒక్క భయం కూడా లేకపోలేదు. బాహ్యంగా ఆ భయాన్ని ఏ ఒక్కరూ వ్యక్తంచెయ్యక పోయినా, అది అందర్నీ పట్టి పీడిస్తున్న భయమే. రవీంద్ర స్టేట్స్‌లో ఏ పాశ్చాత్య లలనామణినో వివాహం చేసుకొని వస్తే.... వాళ్ళు భయపడినట్టు అదే జరిగితే, అందరి ఆశలూ మట్టి గలిసినట్టే.

* * *

అందరూ డా. రవీంద్రను రిసీవ్ చేసుకోడానికి ఏర్‌డ్రోమ్‌కి వెళ్ళారు.

రవీంద్ర ప్రయాణం చేస్తున్న బోయింగ్ విమానం వచ్చింది. రవీంద్ర విమానంనుంచి దిగివస్తూనే తన వాళ్ళని గుర్తించి చేయి వూపాడు. అతణ్ణి రిసీవ్ చేసుకోడానికి వచ్చినవాళ్ళంతా వుత్సాహంగా చేతులు వూపారు. వారిలో అంతు లేని ఆనందం పెల్లుబికింది. సుధ హృదయం స్పందించింది రవీంద్రబావ ఒంటరిగానే వచ్చినందుకు, లోలోన మురిసిపోయింది అమె అంతరంగంలో అంతవరకూ దోబూచులాడుతున్న భయం పటాపంచలయ్యింది. మిగిలినవాళ్ళూ అదే అనుభూతిని పొందారు.

రవీంద్ర వస్తూనే తలిదండ్రుల్ని కౌగలించుకున్నాడు. ఆ పక్కనే నిల్చున్న మామయ్యకి, అతని సరసనే మందస్మిత వదనంతో సిగ్గులొలకబోస్తూ నిల్చున్న 'సుధ'ని అప్యాయంగా పలకరించాడు. "నేను జ్ఞాపకమున్నానన్న మాట.... ఏం బావా?" సిగ్గుతో ముకుళించుకుపోయి అంది సుధ.

"వై నాట్? నీ వుత్తరాలు అనుక్షణం నిన్ను గుర్తుచేస్తూనే వున్నయ్ కదా?" నవ్వుతూనే అన్నాడు రవీంద్ర.

రవీంద్ర మాటల్లో హుందాతనం పెరిగినట్టూ, శరీర ఛాయలో కాస్తంత

మెరుపు వచ్చినట్టు, అప్పుడే గుర్తించింది సుధ.

"నేను యెన్ని వుత్తరాలు రాసినా, నువ్వు మాత్రం యే రెండు నెలలకో, మూడు నెలలకో ఉత్తరం రాసేవాడివి. నాకు భలే కోపం వస్తూండేది బావా" చిలిపిగా అంది సుధ

"అవన్నీ ఇంటిదగ్గర తీరిగ్గా మాట్లాడుకోవచ్చుల్లే అమ్మాయ్. ఇక బైల్దేరండి. అల్లుడు ప్రయాణపు బడలికతో వున్నాడు కదా, కాస్సేపు విశ్రాంతి తీసుకోనీ" నారాయణ కిలిగించుకుంటూ అన్నాడు.

దాంతో అందరూ బైటికొచ్చేసి కారులోనూ, టాక్సీలోనూ ఇంటిముఖం పట్టారు.

ఆ రోజు రామరాజు ఇల్లు, బంధుజనంతో, స్నేహితులతో, కళకళలాడుతూ హడావిడిగా వుంది. సుధ స్నేహితురాళ్లు ఆమెనో ఆట పట్టిస్తున్నారు.

రామరాజు, నారాయణ కేవలం బావ మర్దులే కాదు—సన్నిహిత స్నేహితులు కూడాను. నారాయణ ఆర్థికంగా ఓ మెట్టు పైనేవున్నా, రామరాజుని యేనాడూ చిన్న చూపు చూళ్ళేదు. తన కొడుకు విదేశాల్లో వున్నాడన్న ఆధిక్యత రామరాజూ కనబర్చలేదు. అటువంటి భేషజాలు, అహం భావాలు లేవుగాబట్టే ఆ రెండుకుటుంబాలూ అనన్య ఐక్యతతో మసలుతున్నాయి.

రవీంద్ర వచ్చేశాడు గాబట్టి, యింక వుపేక్షించకుండా, అతడి వివాహం సుధతో జరిపించేయాలన్న యోచన వాళ్ళిద్దరికీ వుంది.

అందుకనే, మరునాడు అందరూ కూచుని కబుర్లు చెప్పుకుంటున్న తరుణంలో, రామరాజే ఆ ప్రసక్తి తీసుకొచ్చాడు.

"ఒరేయ్ రవీ! నువ్వెలాగూ వచ్చేశావు. ఇన్నాళ్ళనించీ మేమందరమూ యెదురు తెన్నులు చూస్తోన్న నీ వివాహం జరిపించేయడానికి యేర్పాట్లు చేయించమంటావా! మీ మావయ్య కూడా ఆరాటపడుతున్నాడు"

నారాయణ చప్పున అందుకున్నాడు. "ఔన్రా రవీంద్రా! మా చిరకాలవాంఛ, మీ యిరువురి వివాహబంధం. సుధ, నువ్వూ, చిలకాగోరింకల్లా మా కళ్ళముందు తిరుగాడుతుండటమే మేమంతా కాంక్షించేది."

సుధ సిగ్గుతో మొహం దించుకునే వుంది.

రవీంద్ర, చప్పున జవాబు చెప్పలేకపోయాడు. ఈ ప్రశ్న తప్పకుండా యెదురవుతుందని, స్టేట్స్‌లో బైలుదేరుతున్నప్పుడే అనుకున్నాడు. సమాధానం యేంచెప్పాలో కూడా అప్పుడే నిర్ణయించుకున్నాడు. అయితే, తాను నిర్ణయించుకున్న సమాధానం, తనవాళ్ళెవంకీ సంతృప్తినివ్వదని అతనికి తెలుసు. అందుకే, కాస్తంత తటపటాయించాడు.

"ఏమిట్రా అబ్బాయ్, అంతగా ఆలోచిస్తున్నావు?" తల్లి శకుంతల అంది. "ఇందులో ఆలోచించడానికేముంది? సుధ పుట్టిందగ్గర్నించీ మేం అనుకుంటున్నదేగా, మీ యిద్దర్నీ ఓ ఇంటివారిని చెయ్యాలని. ఇది మా అందరి అభిలాష."

రవీంద్ర గుటకలు మింగాడు.

"అది కాదమ్మా! నా పెళ్ళికి, యిప్పుడేం తొందరొచ్చిందని?" అన్నాడు ఆకరికి.

అక్కడున్న వాళ్ళందరి మధ్య, ఓ బాంబు పడినట్టయ్యింది. అందరూ విస్తుబోయారు. వారి మొహాల్లో రంగులు మారినయ్.

ఎప్పుడో నిర్ణయమైన యీ పెళ్ళికి రవీంద్ర సంతోషంగా అంగీకరిస్తాడని, అందరూ నమ్మేవారు. ఆశతో వుండేవారు. కాని యిప్పుడు రవీంద్ర వేసిన యెదురుప్రశ్న వారి నమ్మకాన్ని వమ్ము చేసింది. వారిలో నైరాశ్యం చోటుచేసుకుంది. సుధ గుండెలు ఝల్లుమన్నాయి. రవీంద్ర బావపై తానెన్ని ఆశల్ని పెంచుకుంది. తన భవిష్యత్తును గురించి యెన్నెన్నో సుందరస్వప్నాల్ని కన్నది. కాని, రవీంద్ర యిప్పుడిలా అంటున్నాదేమిటి? ... ఆమెలో నిరాశ ఛాయలు ముసురుకున్నాయి,

రామరాజు మొహం, చిరుకోపంతో రాగరంజితమయ్యింది.

"ఏమిట్రా రవీ నువ్వంటున్నది? నీ పెళ్ళికి తొందరేమొచ్చిందంటున్నావా? నీకు వయస్సు రాలేదనే అనుకుంటున్నావా? సరైన వయస్సులో పెళ్ళిచేసి

వుంటే, యీసరికి యిద్దరు బిడ్డల తండ్రివి అయ్యుండేవాడివిరా: నీ మాట యెట్లా వున్నా, నిన్నే నమ్ముకుని, నీమీద యెన్నో ఆశల్ని పెంచుకున్న సుధ సంగతేవిఁటి?" అన్నాడు రామరాజు.

"ఔను రవీంద్రా: 'సుధ'కి యింకా పెళ్ళి చెయ్యలేదేమని అంతా అడుగుతూ వుంటే, మేం యేం సమాధానం చెబుతాం చెప్పు: ఎన్నో సంబంధాలు వస్తున్నా, మేనరికం వుందని చెప్తూ వస్తున్నాం." తన ఆందోళనవి వ్యక్తంచేశాడు, నారాయణ.

రవీంద్ర యిరకాటంలో పడ్డాడు. "అది కాదు మావయ్యా! మీ సమస్యలు మీరు చెబుతున్నారు బాగానే వుంది. కానీ, నా సమస్యల్ని మీరు సహృదయంతో ఆలోచించాలి. మరో మూడేళ్ళు స్టేట్స్‌లో వుండడానికి నాకు అవకాశం దొరికింది. ఇటువంటి అవకాశాలు అందరికీ రావు. ఇది నా భవిష్యత్తుకి సంబంధించిన విషయం. అందుకే, మరో మూడేళ్ళయినా ఆగితే వివాహం చేసుకుంటాను." అన్నాడు తొణక్కుండా.

రవీంద్ర యీసారి వెలిబుచ్చిన వైనం మరింత ఆశ్చర్యంలో ముంచింది, అందర్నీ. అతడు భారతదేశం తిరిగి వచ్చేశాడనే అనుకుంటున్నారుగానీ, మళ్ళీ వెళ్ళిపోతాడన్న విషయం, అతని తలిదండ్రులక్కూడా తెలీదు. అందరి మొహాలూ తెల్లబడినయ్.

సుధ, కలవరపడింది. నీరసించిన కళ్ళతో రవీంద్రకేసి చూసింది ఆచూపులు 'నిజమేనా?' అని నిలదీసి అడుగుతున్నట్టు న్నయ్... అలా అనిపించింది రవీంద్రకి.

"నిజం సుధా, బిలీవ్ మి.. ఇటువంటి సదవకాశాన్ని జారవిడచుకోవడం నా కిష్టంలేదు. ఈ అవకాశపు విలువను నువ్వు గుర్తించగలవనుకుంటాను.." ఆమె మనోభావాన్ని చదివినట్టుగా ఆమెకి సమాధానం చెప్పాడు, రవీంద్ర

నారాయణ, రామరాజుకేసి అదోలా చూశాడు. "ఏం బావా, రవీంద్ర యేకంగా వచ్చేస్తున్నాడనే చెప్పావు కదా: మరి, యిప్పుడిలా అంటాదేవిఁటి" సూటిగా ప్రశ్నించాడు.

"నే నలా చెప్పిన మాట వాస్తవమే బావా: నాకు తెల్సిన నిజం కూడా అదే: రవీంద్ర చెబుతున్న విషయం, యింత వరకూ నాకు గాని, మీ చెల్లెలిగ్గాని తెలీదు." అంటూ కొడుక్కేసి అసహ్యంతో చూశాడు "ఆయేడుపేదో ముందుగానే వుత్తరంలో యేడవలేకపోయ్యావ్రా?" కోపాన్ని అణుచుకోలేక అన్నాడు రామరాజు. తన మాటకి విలువలేకుండా పోయిందన్న విషయం అతణ్ణి బాధించింది.

"వ్యవధి లేకపోయింది నాన్నా."

రామరాజు మరేం అనలేకపోయాడు. కానీ, నారాయణ వూరుకోలేదు

"సరే: బాగానే వుంది. నువ్వా అవకాశాన్ని వదులుకోదల్చకపోతే, నిన్ను

మేం బలవంతపర్చంరా రవీ: నువ్వు స్టేట్స్‌లోనే మరో మూడేళ్ళు వుండు. ఎవరు కాదన్నారు? కాని, దానికీ, నీ పెళ్ళికి ముడి పెట్టడ మెందుకు? హాయిగా వివాహం చేసుకొని, మీ రిద్దరూ వెళ్ళి అక్కడే మూడేళ్ళూ వుండొచ్చును కదా: అలా యెంతమంది వుండటంలేదు?" బాధ్యత గల 'సుధ' తండ్రిగా, నారాయణ తన అభిమతాన్ని వెలిబుచ్చాడు.

అంతవరకూ మౌనంగా వున్న రవీంద్ర తల్లి మళ్ళీ అందుకుంది.

"ఔనా అబ్బాయ్! మావయ్య చెప్పింది బాగానే వుందిగా! అట్లాగే చేద్దాం. నీ కోరికా తీరుతుంది. మా సమస్యా పరిష్కృతమౌతుంది."

రవీంద్ర కొత్త చిక్కులో యిరుక్కున్నాడు.

అతని మొహం పాలిపోయింది. ఆ చిక్కులోంచి యెలా బైటపడ్డమా అని తీవ్రంగా యోచించాడు.

"మీ రెవ్వరూ నన్ను అర్థంచేసుకోవడం లేదమ్మా. వివాహం చేసుకుని మా యిరువురం అక్కడికి వెళ్తే, సుఖంగా కాలం గడపలేం. అక్కడి వాతావరణం వేరు. సుధ యెన్నో యిబ్బందుల్ని యెదుర్కోవల్సి వస్తుంది. అందుకే, మరో మూడేళ్ళు ఆగితే...." అని రవీంద్ర యింకేదో చెప్పబోతూవుంటే, రామరాజు అడ్డొచ్చాడు.

"అది పదిలంగా వుండదురా అబ్బాయ్: మనం మాటకి కట్టుబడి వుండాలి. అది మన ధర్మం. నన్నడిగితే, నువ్వు మళ్ళీ స్టేట్స్‌కి వెళ్ళడమనే నిర్ణయాన్ని విరమించుకుంటే సరి. మీ మావయ్య కట్నం రూపంలో లక్షరూపాయ లిస్తానంటున్నాడు. హాయిగా ప్రయివేటు ప్రాక్టీసు పెట్టుకో. మా కళ్ళముందు మీ రిద్దరూ తిరుగుతూ, మాకు ఆనందాన్ని పంచి పెట్టు"

రవీంద్రకి విసుగుపుట్టింది. అతని మొహం యెర్రబారింది. తను యే విధంగానూ మెత్త బడకూడ దనుకున్నాడు.

"అబ్బ! ఏమిటినాన్నా, మీ మొండి పట్టుదల? డబ్బు ప్రసక్తి యిప్పుడెందుకూ? నాకొచ్చిన సదవకాశాన్ని విడుచుకోనంటున్నాను గాని, డబ్బుకోసం వెళ్తున్నానంటారా?" అసహ్యంగా అన్నాడు రవీంద్ర.

సుధకి వొళ్ళు మండిపోయింది. ఆమె సన్నని, యెర్రని అధరాలు కోపంతో వణికినయ్. ఆమె మొహం, కెంపు రంగును పులుముకుంది. ఇన్ని విధాలుగా పెద్దలు చెబుతున్నా, రవీంద్ర బావ తప్పించుకోవాలని చూడ్డం, ఆమెలో యెన్నో సందేహాల్ని రేకెత్తించింది. తన పట్ల బావకి యేమాత్రం అనురాగం, ప్రేమ, అభిమానంవున్నా, యిలా తాత్సారం చేసివుండేవాడు కాదన్న నమ్మకం ఆమెలో బలంగా యేర్పడింది. దాంతో, ఆమెకి రవీంద్రపట్ల వుండే 'ప్రేమ'



అనే 'క్రేజ్' కరిగిపోయింది. ఓ విధమైన జుగుప్స కలిగింది.

ఆ విశృద్ధ వాతావరణాన్ని చింకుకొని, ఆమె గొంతు పెగిలింది.

"బావా: సారీ....మిస్టర్ రవీంద్రా: స్టేట్స్‌కి వెళ్ళి, ఆ వాతావరణంలో కొన్నాళ్ళయినా పెరిగిన నీలో, నవనాగరికత బాగా జీర్ణించుకుందనే అనుకుంటున్నాను. మీనాన్న, మానాన్న నీకు నచ్చజెప్పాలని శక్తి వంచనలేకండా ప్రయత్నిస్తున్నా, నువ్వు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నావే గాని, వారి ప్రతిపాదనల్ని స్వీకరించడం లేదంటే, దానికి బలీయమైన కారణం యేదో వుండివుంటుంది. నువ్వు స్టేట్స్‌కి మళ్ళీ వెళ్ళడంలో, డబ్బు ప్రసక్తి లేదంటున్నావు బాగానే వుంది. అయితే, నువ్వు వెళ్ళడానికి, నాతో వివాహానికి తాత్సారం చెయ్యడానికి ఒకే ఒక్క కారణం వుండి వుంటుందనుకోవడంలో తప్పులేదు. అదే నీ వివాహం: అక్కడ యెవరినో నువ్వు వివాహం చేసుకున్నావు ....లేకపోతే, నీ తలిదండ్రుల్ని, నన్నూ నిరుత్సాహపర్చే ధైర్యం నీలో రాదు నీ మనోభావాల్ని అర్థంచేసుకోలేదనుకోకు. ఉన్న నిజం ఒక్కముక్కలో చెప్పేస్తే పోయేదిగా:" విసురుగా అందామె.

"ఏవిటి సుధా, యేవిటా మాటలు:" దబాయించాలని మరో ప్రయత్నం చేశాడు రవీంద్ర.

"మరేం చెప్పొద్దు మిస్టర్ రవీంద్రా: దబాయించాలని, మమ్మల్ని నమ్మించాలని వ్యర్థప్రయత్నం చెయ్యకు. నిజాన్ని ఒప్పుకో: నేను బాధపడతానని అనుకోకు ....అటువంటి బాధేలేదు నాకు... .... నా వ్యక్తిత్వం నాకుంది. నా అదృష్టం నాకుంది...." నిష్కర్షగా చెప్పింది.

రవీంద్ర మొహం వివర్ణమయ్యింది. నలుగురి సమక్షంలో సుధ తనచే అవమానపడ్డదనుకున్నాడు గావోసు— చప్పున లేచి అక్కణ్ణించి పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

రామరాజు, శకుంతల విస్తుపోయారు. స్థాణువుల్లా నోటమాటరాక, క్షణం వుండిపోయారు.

నారాయణ మాత్రం కూతురి ప్రవర్తనకు లోలోపల మురిసిపోయాడు. రవీంద్రకి బాగానే బుద్ధి చెప్పిందని, సమాధానపడ్డాడు.

"ఛీ! ఛీ! ఏం నాగరికతో యేమిటో!" అని తనలో తనే గొణుక్కున్న రామరాజు, నారాయణకేసి తిరిగి "బావా, నన్ను క్షమించు." అన్నాడు.

నారాయణ చిన్నగా నవ్వేడు.

"నువ్వేం చేశావని నిన్ను క్షమించడం బావా? ఆ విషయం మర్చిపో, అన్నీ మన మంచికే అనుకుందాం."

"మావయ్యా! మీరేం బాధపడకండి. మీరంటే నాకెప్పుడూ గౌరవమే," అంది సుధ.

"ఆ మాట చాలమ్మా నా తృప్తికి.... ఆత్మ సంతృప్తికి" అంటూ భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు రామరాజు.

శకుంతల మాత్రం కళ్ళొత్తుకుంటూ అక్కణ్ణించి లేచి వంటగదికేసి వెళ్తూ "లేవండర్రా, భోజనాలు చేద్దాం" అంది.

మేనత్తతో పాటు సుధ కూడా హుషారుగా వెళ్ళింది లోపలికి.

ఒక్కసారి వాతావరణం గంభీరంగా మారిపోయిందా ఇంట్లో!